బడులు తెరిచేలోగా.. ఏక దుస్తులందేనా!

- ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలి
- మహిళా సంఘాల ద్వారా దుస్తులు కుట్టేందుకు కార్యాచరణ
- మండలాలకు చేరిన యూనిఫామ్ వస్త్రం
- కొన్ని చోట్ల ముందుకు రాని మహిళా సంఘాలు
- జూన్ రెండో వారంలో దుస్తుల పంపిణీకి చర్యలు: డిఇఒ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. అప్పటి వరకు విద్యార్థులకు ఇవ్వాల్సిన ఏక దుస్తులు రెడీ అయ్యేనా..? ఏటా యూనిఫామ్స్ కుట్టించే విషయంలో ఆలస్యం జరుగుతూ వస్తోంది. కొత్త ప్రభుత్వంలోనైనా సమయానికి విద్యార్థులకు యూనిఫామ్స్ అందేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు కావాల్సిన దుస్తుల్ని మహిళా సంఘాల ద్వారా కుట్టించేందుకు విద్యా శాఖ డిఆర్‌డిఎ ద్వారా కార్యాచరణ రూపొందించింది. కొన్ని చోట్ల దుస్తులు కుట్టేందుకు కూలి రేట్లు గిట్టుబాటు కావట్లేదని మహిళా సంఘాలు ముందుకు రాని పరిస్థితి ఉంది. దుస్తులు కుట్టిన వెంటనే డబ్బుల్ని సకాలంలో చెల్లించకపోవడం వల్ల కూడా మహిళలు ఆసక్తి చూపట్లేదంటున్నారు. దుస్తులకు కావాల్సిన వస్త్రం సరఫరాలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు అందజేయాలి. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే దుస్తులు సిద్ధం చేసి పాఠశాల పున:ప్రారంభం కాగానే పంపిణీ చేయాలి. లక్షలాది మంది విద్యార్థులకు దుస్తులు కుట్టించి పంపిణీ చేసే విషయంలో విద్యా శాఖ ఏటా ఆలస్యం చేస్తూ వస్తోంది. కనీసం ఈ సారైనా సకాలంలో పంపిణీ చేస్తుందో లేదో చూడాలి. రాష్ట్రంలో 41,337 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో 60.20 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 391 కస్తూర్బాగాంధీ పాఠశాలలు, 194 మోడల్ స్కూల్స్, 916 గురుకులాలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3277 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో గతేడాది 3.20 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, విద్యా ప్రమాణాలు మెరుగుపడటం కోసం అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. ముఖ్యంగా 'మన ఊరు-మన బడి' కింద 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. దాంతో ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాల్లో నో అడ్మిషన్స్ అనే బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు అందించాల్సిన యూనిఫామ్స్ కుట్టించే పనిలో వేగం పెంచాల్సిన అవసరముంది.

మహిళా సంఘాల ద్వారా దుస్తులు కుట్టేందుకు కార్యాచరణ

విద్యార్థులకు కావాల్సిన ఏకరూప దుస్తులను కుట్టించే పనిని స్థానిక స్వయం సహాయ మహిళా సంఘాలకు అప్పజెప్పేందుకు విద్యా శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సమన్వయంతో కార్యాచరణ రూపొందించాయి. ఆయా మండలాల్లో ఎంపిడిఒ, ఎంఇఒ, డిఆర్‌డిఎ, డిపిఎం, ఎపిఎం, మెప్మా నుంచి ఒకరు చొప్పున కమిటీ వేశారు. ఈ కమిటీ సమన్వయంతో విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించి పంపిణీ అయ్యేలా చూడాలి. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా యూనిఫామ్స్‌కు సంబంధించిన వస్త్రం మండలాలకు చేరింది. ఆయా పాఠశాలల వారిగా డిఆర్‌డిఎ ద్వారా పట్టణాల్లో మెప్మా ద్వారా స్థానిక స్వయం సహాయ సంఘాలతో దుస్తులను కుట్టించాలి. మూడు జిల్లాల్లో కలిపి 3277 ప్రభుత్వ పాఠశాలల్లో 3.20 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరికి రెండు జతల చొప్పున దుస్తులను పంపిణీ చేయాలి. వీటిని కుట్టించేందుకు అవసరమైన వస్త్రాలను రాష్ట్ర చేనేత శాఖ ద్వారా సమీకరించి ఆయా జిల్లా విద్యా శాఖ అధికారులకు అప్పజెప్పారు. సదరు వస్త్రాన్ని డిఆర్‌డిఎ ద్వారా గుర్తించిన మహిళా సంఘాల ద్వారా విద్యార్థుల నుంచి కొలతలు సేకరించి దుస్తులను కుట్టిస్తారు.

చాలా చోట్ల ఆసక్తి చూపని మహిళలు

విద్యార్థులకు సంబంధించిన దుస్తులను కుట్టే విషయంలో కొన్ని చోట్ల మహిళా సంఘాలు ఆసక్తి చూపట్లేదు. ప్రభుత్వం ఇచ్చే కుట్టు కూలి గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. ఒక్కో జత దుస్తులను కుట్టినందుకు మహిళలకు రూ.50 మాత్రమే చెల్లిస్తున్నారు. రెండు జతల దుస్తులు కుడితే రూ.100 ఇస్తారు. రోజుకు నాలుగు జతలు కుట్టినా రూ.200 కూలి కూడా గిట్టట్లేదని పలువురు మహిళలు చెబుతున్నారు. విద్యార్థుల నుంచి కొలతలు తీసుకోవడం, దారం, సూది, ధరలు పెరగడం, దుస్తుల కోసం వస్త్రాన్ని కట్ చేయడం, కుట్టడం కోసం కూలీలు పనిచేయాల్సి రావడం, కుట్టు మిషన్స్ నడిస్తే కరెంట్ ఛార్జీల భారం పడటం వంటి కారణాలను చెబుతున్నారు. కష్టపడి దుస్తులను కుట్టి ఇస్తే కూలి డబ్బులు విద్యా సంవత్సరం ముగింపులో చెల్లిస్తున్నారని పేర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 1045 పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు మాత్రమే దుస్తులు కుట్టేందుకు మహిళా సంఘాలు ముందుకొచ్చారు. మరో 252 పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు కుట్టేందుకు ముందుకు రాలేదు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం దుస్తులు కుట్టిన వెంటనే కూలి డబ్బులు చెల్లించడంతో పాటు కూలి రేట్లను కనీసం రూ.100లకు పెంచాలని మహిళలు కోరుతున్నారు. మార్కెట్‌లో ఒక జత బట్టలు కుడితే రూ.500 కూలి ఉంది. యూనిఫామ్స్ అయినందున కనీసం అందులో పావొంతైనా ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రతి ఏటా ఆలస్యమవుతోంది:
మహేష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంగారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించి పంపిణీ చేయడంలో ప్రతి ఏటా ఆలస్యం చేస్తున్నారు. విద్యా శాఖ పాఠశాలలు ప్రారంభించే సమయంలో హడావుడి చేస్తుంది. దీని వల్ల పాఠశాలల పున:ప్రారంభం నాటికే దుస్తులు అందడం లేదు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి చదివి విద్యార్థులకు పాఠశాలలు ముగింపు సమయంలోనే కొలతలు తీసుకుని దుస్తులను కుట్టించాలి. యూనిఫామ్ వస్త్రాన్ని తక్కువ పంపడం, టైలర్లకు తక్కువ కూలి ఇవ్వడం వల్ల ఆలస్యమవుతోంది. కొత్త ప్రభుత్వంలోనైనా సకాలంలో యూనిఫామ్స్ అందజేయాలి.

పాఠశాలల పున:ప్రారంభం వరకు దుస్తులు సిద్ధం:
వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా అధికారి, సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 1045 పాఠశాలల్లోని విద్యార్థులకు దుస్తులు కుట్టే పని జరుగుతుంది. ఇప్పటికే 50 శాతం దుస్తులు కుట్టారు. మిగతావి ఈ నెలాఖరులోగా పూర్తవుతాయి. మరో 232 స్కూల్స్‌లోనూ మహిళా సంఘాలకు అప్పజెప్పే ప్రక్రియ కొనసాగుతుంది. జూన్ రెండో వారంలోగా విద్యార్థులకు దుస్తుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

కిర్గిజిస్థాన్‌లోని తెలంగాణ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

- ప్రత్యేక మంత్రిని కేటాయించి పర్యవేక్షించాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇటీవల మూకుమ్మడి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, భారతదేశంతో సహా విదేశీ విద్యార్థులందరి భద్రత పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. మంగళవారం కూడా పలు ఘటనలు జరిగాయని పేర్కొంది. ఎక్కువ మంది తెలుగు విద్యార్థులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిని కేటాయించి పర్యవేక్షించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కూడా కిర్గిజ్‌స్థాన్‌లో చదువుతున్నారని, అక్కడ పెరుగుతున్న హింసాకాండను దృష్టిలో ఉంచుకుని వారి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యార్థుల కోసం ప్రత్యేక కమిటీని వేసి సచివాలయంలో సహాయక కేంద్రాన్ని ప్రారంభించాలని సూచించారు. తద్వారా వారి సమస్యలను తెలుసుకుని సహాయపడొచ్చని వివరించారు. వారి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడానికి కిర్గిజ్‌స్థాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత విద్యార్థులకు వారి కుటుంబాలు సంబంధిత అధికారుల మధ్య సమన్వయం సులభతరం చేయాలని తెలిపారు. విదేశాల్లో ఉన్న రాష్ట్ర విద్యార్థులను రక్షించడానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

టెట్‌కు మూడో రోజు 79.09 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో ఈనెల 20న ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడో రోజు పేపర్-2 (మ్యాథ్స్, సైన్స్) అభ్యర్థులకు పరీక్ష నిర్వహించామని తెలిపారు. 29,550 మంది దరఖాస్తు చేయగా, 23,371 (79.09 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. 6,179 మంది (20.91 శాతం) మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. ఉదయం మొదటి విడతకు 15,199 మంది దరఖాస్తు చేయగా, 11,990 (78.89 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 3,209 (21.11 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండో విడతకు 14,351 మంది దరఖాస్తు చేస్తే, 11,381 (79.30 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 2,970 (20.7 శాతం) మంది పరీక్ష రాయలేదని వివరించారు. బుధవారం టెట్ రాతపరీక్షలను ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

సిసిఎస్ ఎసిపికి 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైదరాబాద్ సిసిఎస్ ఎసిపి టిఎస్ ఉమామహేశ్వరరావును అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు బుధవారం కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమామహేశ్వరరావును చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం తెల్లవారుజామునే హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఎసిపి ఇంటికి చేరుకున్న ఎసిబి అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 14 చోట్ల ఏకకాలంలో మరిన్ని బృందాలు సోదాలు జరిపాయి. ఉమామహేశ్వరరావు సోదరుడితోపాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ ఇవి కొనసాగాయి. సోదాల్లో భారీగా రూ.500 నోట్ల కట్టలను, ఆభరణాలను, 17 ప్రాంతాల్లో ఉన్నస్థిరాస్తుల పత్రాలను గుర్తించారు. ఇప్పటివరకు విశ్లేషించిన మేరకు ఆదాయానికి మించిన ఆస్తుల విలువ రూ.3.46 కోట్ల వరకు ఉన్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రెట్టింపు ఉంటుందని భావిస్తున్నారు.

రేపటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ మూడో తేదీ వరకు అవి జరుగుతాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ంఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీఇ.ఱఅ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను ప్రిన్సిపాళ్ల సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశించారు.

ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు షెడ్యూల్ ప్రకటించాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి పిఆర్‌టియు తెలంగాణ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కమిషన్ (ఇసి) అనుమతితో ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. . ప్రస్తుతం పదోన్నతులు చేపట్టేందుకు ఎలాంటి అడ్డంకుల్లేవని పేర్కొన్నారు. గతంలో బదిలీల ప్రక్రియ కోర్టు కేసు ద్వారా వాయిదా పడిందని తెలిపారు. ఆ సమయంలో ఎలాంటి అడ్డంకి లేని పదోన్నతులు చేపడితే ఉపాధ్యాయులకు న్యాయం జరిగేదని పేర్కొన్నారు. ఎన్ని వినతిపత్రాలు సమర్పించినా విద్యాశాఖాధి కారులు సకాలంలో స్పందించలేదని తెలిపారు. జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని, పండితుల అప్‌గ్రెడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. వీలైనంత తొందరగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తామంటూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు.

తడిచిన, మొలకెత్తిన వడ్లను కొనాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పంట పండించిన పంట అకాల వర్షాలతో తడిచి వడ్లు మొలకెత్తాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. మరో పక్క ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. కల్లాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పడిందని అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందని తెలిపారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారన్నారు. కాలం కూడా కక్ష కట్టినట్టు అకాల వర్షాలతో ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తడంతో ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని చెప్పారు. కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి నెలకొందన్నారు. తరుగు తీయకుండా వెంటనే వడ్లు కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 40 శాతం ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని, లారీల సంఖ్య పెంచి ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వాన్ని రైతుల పక్షాన కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువైన సన్నరకాన్ని సాధారణంగా రైతులు సాగు చేయరని, సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని అందులో 3.21 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారని తెలిపారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి, కేవలం 5శాతం సన్నవడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని అన్నారు. ఎకరానికి రూ.7500 రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ పనులు మొదలుకాకముందే జూన్‌లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగ్రో సేవా కేంద్రాల్లో పచ్చి రొట్టె విత్తనాలు ఇవ్వడం లేదని, విత్తనాల కోసం రైతులు పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టి వేచి చూసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పడిందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లనీ, ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని హితవు పలికారు. జడ్‌పి చైర్‌పర్సన్ రోజా శర్మ, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జూన్ ఆరు నుంచి మేడిగడ్డపై విచారణ

- ఎన్డిఎస్ఎ నివేదిక ఆధారంగా నోటీసులు
- వీడియో క్లిప్పింగుల సేకరణ
- ఇంజనీర్లతో ఇఎన్‌సి జనరల్ భేటీ
- రాహుల్ బొజ్జా లేఖపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల విఫలంపై జస్టిస్ పినాకిని చంద్రఘోష్ న్యాయ విచారణలో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. జూన్ ఆరు నుంచి పూర్తిస్థాయి విచారణకు కమిషన్ సన్నద్ధమవుతున్నది. ఇందుకు ఎన్‌డిఎస్ఎ మధ్యంతర నివేదికను ఊతం చేసుకోనుంది. దీని ఆధారంగా అధికారులు, రాజకీయనాయకులు, ప్రజాప్రతి నిధులకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరనుంది. ఈ మేరకు సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే నెల తొలి రోజుల్లో మళ్లీ జస్టిస్ ఘోష్ హైదరాబాద్ రానున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైనట్టు తెలిసింది. విచారణలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఇంజనీర్లతో తొలుత విచారణ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరానికి సంబంధించి సమగ్ర నివేదికను మరోసారి జస్టిస్ పినాకిని చంద్రఘోష్‌కు అందించాలని, ఎలాంటి వివరాలు, నివేదికలు దాచడానికి విల్లేదని రాహుల బొజ్జా లేఖ ద్వారా ఆదేశించారు. ఇదిలావుండగా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల్లో భాగంగా సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన లేఖపై ఇంజనీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ ఇతర ఇంజనీర్లతో భేటి అయి చర్చించారు. ఆమేరకు సమాచారాన్ని గుదిగుచ్చి నివేదిక రూపంలో గురువారం సాయంత్రానికి తయారుచేయాలని చెప్పినట్టు తెలిసింది. ప్రాథమిక ప్రణాళిక నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు ప్లానింగ్, టెక్నికల్, ఆర్థిక అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదికలో పొందుపరచాలని సాగునీటి శాఖ అధికారులకు చెప్పారు. అవసరమైతే ఎల్అండ్‌టి అధికారుల సహకారం తీసుకోవచ్చని సూచించినట్టు సమాచారం. ఆ నివేదికను ఈ నెల 25న ముఖ్యకార్యదర్శితోపాటు జస్టిస్ ఘోష్ కార్యాలయానికి అందజేయనున్నారు. గత నాలుగేళ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై పత్రికా, ప్రసారసాధనాల్లో వచ్చిన ప్రింట్ మీడియాలో వచ్చిన క్లిప్పింగులతోపాటు వీడియో క్లిప్పింగులను న్యాయ విచారణ కమిషన్‌కు తోడ్పడుతున్న కమిటీ సేకరిస్తున్నది. జూన్ ఆరు నుంచి ప్రారంభమయ్యే విచారణ నాటికి ఈ సమాచారాన్ని అంతా ఘోష్ కార్యాలయం సిద్ధం చేయనున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ సాగునీటి శాఖ మంత్రి టి హరీశ్‌రావుతోపాటు సర్వీసు నుంచి డిస్మిస్ అయిన రామగుండం మాజీ ఇఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, మాజీ ఇఎన్సీ జనరల్ సి. మురళీధర్ తదితరులను విచారణకు పిలవనున్నట్టు విశ్వసనీయ సాగునీటి శాఖ అధికారవర్గాలు తెలిపాయి. కెసిఆర్‌ను పిలిచే ముందే సమగ్ర సమాచారాన్ని సేకరించిపెట్టుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా మేడిగడ్డ బ్యారేజీ దగ్గరకు సిడబ్ల్యూసి బృందం బుధవారం అక్కడ భూగర్భ పరీక్షలు నిర్వహించినట్టు సమాచారం.

IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM VI ADDITIONAL METROPOLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT AT :: L.B. NAGAR
O.S. NO. 119 OF 2024

BETWEEN:
Vankayalawar Paandu and others ...Plaintiffs
AND
Vankayala Shankar and All Concerned ...Defendants

To
All Concerned

That the General Public are hereby informed that the Plaintiffs herein filed the above suit for declaration and Perpetual Injunction to declare the Plaintiffs No. 1 and 2 the legal heirs of Deceased Late V. Hanumanth Rao who died on 15-01-2015 in respect of the suit schedule property therein which are clearly shown hereunder :

That the above suit posted on 25-06-2024 for appearance. Hence, in this regard if any person or persons having interest or objection whatsoever, then they may appear before the said court at 10.30 A.M. either personally or through an Advocate and submit their claims, otherwise the matter will be decided exparte.

SCHEDULE OF PROPERTY

All that the plot bearing No. 16 West art, situated in Sy.Nos. 787 and 790 admeasuring 100 sq. Yards or 83. 1 sq. Meters, situated at Nadergul Village, Balapur Mandal (earlier Saroornagar Mandal), Ranga Reddy District, Under Badangpet Municipal Corporation and bounded by: North: 20' Wdie Road, Sourt: Plot No. 19, East Plot No. 16 East Part, West: Plot No. 17:
(By Order of The Court)

DANDU PRABHU
Advocate

BEFORE THE KARNATAKA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION BASAVA BHAVAN, HIGH GROUNDS BANGALORE-560001.
Under the Consumer Protection Act, 1986
Consumer Case No. 234/2022

Mrs. Akanksha Naresh ... PETITIONER/ COMPLAINANT/APPELLANT
-Versus-
M/s GJS Infratech Private limited ... OPPOSITE PARTY / RESPONDENTS

OPPOSITE PARTY / RESPONDENTS NAME

To, **1. M/s GJS Infratech Private Limited,** Office at Venkori Building Plot No. 809.Ayyappa Society Hi-tech city, Madhapur Hyderabad-500 081. Also at (as per the Company master Data)

2. M/s GJS Infratech Private Limited, Plot No.852 & 853 Swamy Ayyappa Co-operative Road No 45, Madhapur, Hitechcity, Hyderabad-500081.

3. Mr. Jagam Vishwanth, Director and Authorised Signatory office at M/s GJS Infratech private limited, Plot No.852& 853 Swamy Ayyappa Co-operative Road No 45, Madhapur, Hitechcity, Hyderabad-500081.

4. Mr. Jagam Gopi, Director and Authorised Signatory S/o Poshanna Jagan R/at Flat No.51008 Block 5, Indu Fortune Field 7th Phase Near Hi-tech City Railway Station KPHB Colony, Kukatpally, Hydarabad-500 072.

CONSUMER COMPLAINT NOTICE UNDER SECTION 47 OF THE AMENDED C.P.A.2019 TO THE OPPOSITE PARTIES NO.1 TO 4

Whereas, the Complainant has filed the above complaint against you seeking remedy. You are hereby notified to appear before this Commission in person or through a pleader or person authorized to answer all the material facts relating to the complaint on **10/06/2024** at **11:00 A.M**

Take notice that in case of default of your appearance on the day mentioned above complaint will be heard and determined in your absence.

Given under the hand and seal of this Commission on this 21/05/2024

By order of the Commission, ASST. REGISTRAR-CUM-ASST. ADMN. OFFICER K.S.C.D.R.C, Bangalore-560001.

నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

- చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్, యు ట్యాక్స్ అంటూ తమ పార్టీ నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహేశ్వర్ రెడ్డికి పిచ్చిపట్టిందని విమర్శించారు. పట్టభద్రులకు ద్రోహం చేసిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు వారి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని తెలిపారు. అగ్నిపథ్ పేరుతో బిజెపి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించిన బిఆర్ఎస్ నిరుద్యోగులను జైల్లో పెట్టించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు నిరుద్యోగులకు అవసరమని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాకే ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని చెప్పారు.

చేప పిల్లల పంపిణీపై సందిగ్ధం..!

- స్పష్టత కరువు.. రాని ఆదేశాలు
- ఊసేలేని టెండర్ల ప్రక్రియ
- గతేడాది ఏప్రిల్‌లోనే పూర్తి
- ఎదురు చూస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారుల అభివృద్ధికి గత ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రతి ఏడాదీ ఏప్రిల్ నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేది. సర్కార్ మారడం, వరుస ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఈ కార్యక్రమంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. ప్రస్తుతం మే నెల వచ్చినప్పటికీ ఇంకా టెండర్లు పిలవకపోవడంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు అలుము కున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాక పోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి చేప పిల్లలను పంపిణీ చేస్తారా..? లేదా..? అనే సందిగ్ధం నెలకొంది. చేప పిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని గతేడాది నుంచే మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం నీటి వనరులు ఉన్న చెరువులు, కుంటలు 400 వరకు ఉంటాయి. చెరువులన్నీ అనుకూలంగా లేకపోవడంతో గతేడాది 332 చెరువుల్లో దాదాపు రూ.40 లక్షల విలువగల 68.05 లక్షల చేప పిల్లలను వదిలారు. ఇందులో 35 ఎంఎం సైజ్ సీడ్ చేపలు 58 వేలు, 40 ఎంఎం సైజ్ సీడ్ చేపలు లక్ష, 80 ఎంఎం సైజ్ సీడ్ చేపలు లక్షా 60 వేలు, 100 ఎంఎం సైజ్ సీడ్ చేపలు, లక్ష ఉన్నాయి. జిల్లాలో మొత్తం 82 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3,738 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల కుటుంబాలన్నీ చేప పిల్లల పంపిణీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ది పొందుతున్నాయి. జిల్లాల్లో ఏటా జులై తర్వాత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించే వారు. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. అయితే ఈ సమయంలో చేప పిల్లలను వదిలితే అవి బాగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది మే నెల ముగుస్తున్నా.. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో చేప పిల్లలను పంపిణీ చేస్తారా..? లేదా..? అన్న సందేహం మత్స్యకారుల్లో ఉంది.

టెండర్ల ఊసే లేదు

ప్రతి ఏడాదీ మే నెలలోనే చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచేది. జూన్, జులై నెలల్లో వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరాక ఆగస్టులో మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా.. నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ప్రభుత్వం ఈ కార్యక్రమం ఊసే ఎత్తడం లేదు. చేప పిల్లల కొనుగోలుకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సి ఉన్నా.. ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యకారులు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారు.

నగదు బదిలీకి డిమాండ్..!

రాష్ట్రంలోని కొన్ని ఏరియాల్లో చేప పిల్లలను సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు కూడా పంపిణీ చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల చేప పిల్లలు ఎదగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ పథకాన్ని చేపట్టాలని కోరుతున్నారు. నగదును మత్స్యసహకార సొసైటీలకు ఇస్తే.. తామే నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి సరైన సమయంలో చెరువుల్లో వదులుతాం అంటున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు
పూర్ణిమ, మత్స్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఉచిత చేప పిల్లల పంపిణీ గురించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. గతేడాది మే నెలలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టాం. ప్రభుత్వం నుంచి అధికారంగా ఆదేశాలు వస్తే వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తాం. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. దీని ఆధారంగా జిల్లా స్థాయిలో టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది.

(See Regulation-15(1) (a))

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-20

OA No.114/2024

Bank of Maharashtra, Suryaraopet Branch, Vijayawada, Rep by its Branch Manager ..Applicant
Versus
1.M/s Veeramma Talli Food Industries Pvt.Ltd: Rep by its Directors K.Satya Prasad & G.Ganesh Vishnu Kumar
2.Sri Kokkirala Satya Prasad
3.Sri Gajula Ganesh Vishnu Kumar
4.Sri Gajula Subba Rao ..Defendants

To,
D2: Sri Kokkirala Satya Prasad, S/o Lakshmi Narayana Rao, Aged 45 Years, Director of M/s Veeramma Talli Food Industries Pvt. Ltd: Residing at Flat No.301, Third Floor in Block-A, Abhyas Lake View Residency, Nizampet, Hyderabad, Telangana-500090 (And) D.No.301, Plot 353, Street No.8, Kakatiya Hills, Madhapur, Hyderabad, Telangana: Pin-500081

SUBSTITUTE SERVICE OF SUMMONS BYWAY OF PAPER PUBLICATION

1.Whereas the applicant has instituted the above application u/s 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act., 1993 against you for the the recovery of a sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m. or at such time immediately thereafter according to the convenience of Tribunal on **13-06-2024** to answer the claim.
2.A copy of the application and annexure are to be collected on your appearance before the Tribunal.
3.If you intended to file any documents, you file the same with a list along with the written statement.
4.You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5.Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand the seal of this Tribunal on this the **07th day of May, 2024**

Signature of the Officer
Authorized to issue summons

కారుడోర్ లాక్.. ఊపిరాడక పాప మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కారు డోర్ లాక్ అవడంతో ఊపిరాడక పాప మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో జరిగింది. వివరాల ప్రకారం.. మంగళవారం మండలంలోని సాంబాయి గూడెం గ్రామంలో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఇంటి ముందు ఆగి ఉన్న కారులోకి ఎక్కారు. కాసేపటి తర్వాత పిల్లలు కారు దిగి వెళ్లిపోయారు. కుంజ సాయి, లిఖిత దంపతుల కుమార్తె కల్నిషా (4) కారులోనే ఉండిపోయింది. పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రాత్రి ఎనిమిది గంటల వరకు గాలించారు. చివరికి కారులో ఉన్నట్టు గమనించిన తల్లిదండ్రులు కారు డోర్ ఓపెన్ చేయగా అప్పటికే మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాప ఇంటికెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదవశాత్తు మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడే ఎడ్‌సెట్ రాతపరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎడ్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ రాతపరీక్ష గురువారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఎడ్‌సెట్‌కు 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. గురువారం రెండు విడతల్లో ఎడ్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడతలో 16,929 మంది, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెండో విడతలో 16,950 మంది రాతపరీక్షలకు హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా 79 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, కర్నూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలున్నాయి. రాతపరీక్షలకు 90 నిమిషాల ముందు నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం విడతకు 8.30 గంటల నుంచి, మధ్యాహ్నం విడతకు 12.30 గంటల నుంచి అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లేందుకు అవకాశముంది. పరీక్ష ప్రారంభమైన తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు.. భూ తగాదాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు మండలం పరిధిలోని బూడిదపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బూడిదపాడు గ్రామానికి చెందిన నర్సింహులు అన్నదమ్ముల మధ్య చాలా కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. ఎన్నిసార్లు పంచాయితీ పెట్టినా ఒక కొలిక్కి రాలేదు. గొడవలతో విసిగిపోయిన నర్సింహులు భార్య వరలక్ష్మి, కుమార్తె అనురాధ మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకెళ్లారు. కుటుంబీకులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే ఇద్దరూ మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. అయితే, కూతురు, కొడుకు చదువు కోసం, పెండ్లి కోసం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, వారసత్వంగా వచ్చిన భూములు సీలింగ్ ఉండటంతో ఎవరూ కొనేందుకు ముందుకు రావడం లేదు. ఈ విషయమై చాలాసార్లు అన్నదమ్ములకు విజ్ఞప్తి చేశాడు. అయినా వివాదం సమసిపోలేదు. దాంతో తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. కొడుకు హైదరాబాదులో చదువుకున్నట్టు తెలిసింది.

పని చూపాలంటే రూ.100 ఇవ్వాలంట

- భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో దారుణం
- పనిప్రదేశాల్లో నీళ్లను సరఫరాచేయని కార్యదర్శులపై చర్యలు తీసుకోండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో వ్యకాస వినతి
- డిఆర్‌డిఒలతో విచారణకు ఆదేశిస్తాం : కమిషనర్ అనితారామచంద్రన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో 15 రోజుల ఉపాధి హామీ పని చూపాలంటే ఒక్కో మనిషికి రూ.100 కమీషన్ ఇవ్వాలని అధికారులు బెదిరించడం దారుణమని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఆర్ ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనిప్రదేశాల్లో కార్మికులకు తాగునీటిని సరఫరా చేయని గ్రామ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్‌కు సమస్యలతో కూడిన లేఖను అందజేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఆ రెండు జిల్లాల్లో డిపిఆర్‌ఒలతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, కూలీలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించని గ్రామ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 'భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గం పాడు మండలం సారపాక పంచాయతీలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు కలిసి 15 రోజుల పని చూపడానికి ఒక్కో కూలీ నుంచి రూ.100 కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇచ్చిన వారికి రూ.250పైన వేతనం పడేలా చూస్తున్నారు. పనికి రాకున్నా మస్టర్స్ వేస్తున్నారనే చర్చ కార్మికుల్లో ఉంది. కమీషన్ ఇవ్వని వారికి రూ100-150 మధ్యలో వేతనం వేస్తున్నారు. బూర్గంపాడు పంచాయతీలో పనికి రాని వారికి దొంగ మస్టర్స్ వేసి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, జాబ్‌కార్డు దారులు కుమ్మక్కై ఒక ఖాతా నుండి రూ.22వేలు, మరో ఖాతా నుండి రూ.10వేలు డ్రా చేసిన అవినీతి సోషల్ ఆడిట్‌లో బయటపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రాంతంలో గ్రామ దీపికలుగా పని చేస్తున్న వారు పని కావాలని దరఖాస్తు పెడితే పని ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం నర్సాపూర్ గ్రామంలో ఎఫ్ఎ రాజు గతంలో మేట్‌గా పని చేసిన వారిని ఉపయోగించుకోని మనిషికి రూ.100 కమీషన్ ఇస్తేనే పని చూపుతాం, లేకుంటే పని చూపబోమని కార్మికులను బెదిరిస్తున్న ఘటన బయట పడింది. నిర్మల్ జిల్లాలో కింది స్థాయి అధికారులు సిండికేట్‌గా ఏర్పడి అవినీతి చేస్తున్నారని చర్చ జరుగుతున్నది. పిడి, డిఆర్‌డిఒలకు కార్మికులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోవడం లేదు. పై అంశాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలి. సంబంధిత ఎఫ్ఎలు, టిఎలను విధుల నుంచి తొలగించాలి. వసూలు చేసిన కమీషన్ డబ్బులు కూలీలకు రివకరీ చేయాలి. అడిగిన వారందరికీ పని చూపాలి. పని చూపకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎక్కడ కూడా కూలీలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం లేదు. పని ప్రదేశంలో నీడకు టెంట్, మెడికల్ కిట్టులు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కన్పించడంలేదు. ఫలితంగా వడదెబ్బకు కూలీలు పని ప్రదేశంలోనే చనిపోతున్నారు. కూలీల కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలి. పని చూపని అధికారులను విధుల్లో నుంచి తొలగించాలి' అని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని, చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారని ప్రసాద్ తెలిపారు.

రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- రిఫ్రిజిరేటర్స్‌లో కుళ్లిపోయిన ఆహార వస్తువులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా, సంపాదనే ధ్యేయంగా నగరంలో కొందరు రెస్టారెంట్లను నడుపుతున్నారు. రసాయనాలతో పండ్లు మగ్గపెట్టడంతోపాటు కాలం చెల్లించిన ఆహార వస్తువులను విక్రయిస్తున్నారు. మరికొందరు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా రెస్టారెంట్స్, హోటళ్లు నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎఫ్ఎస్-ఎస్ఎఐ టాస్క్‌ఫోర్సు బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ప్రతి రెస్టారెంట్‌లో అపరిశుభ్రమైన వస్తువులు, వంటగది, నాసిరకపు మసాలా, కారం పొడులను అధికారులు గుర్తించారు. వంట గదుల్లో ఈగలు, క్రిమికీటకాలు తిరుగుతున్నాయి. కాలం చెల్లిన ఆహార వస్తువులను ఉపయోగిస్తున్నారు. తెరిచిన డస్ట్‌బిన్స్‌ను గుర్తించారు. రిఫ్రిజిరేటర్లలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న చికెన్, మటన్, అల్లం పేస్ట్‌తోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న హోటళ్లు, రెస్టారెంట్లను గుర్తించిన అధికారులు కేసులు నమోదు చేశారు. సోమాజిగూడలోని కృతుంగ-పాలెగార్స్ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన పనీర్, ఇతర వస్తువులను ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా నిర్వహించడమే కాకుండా.. రసాయనాలతో తయారు చేసిన వస్తువులు, కాలం చెల్లిన ప్రముఖ కంపెనీల పేస్ట్‌లు ఉపయోగించడాన్ని పరిశీలించారు. కృతుంగ పాలెగార్ బ్రాండ్‌తో అందిస్తున్న వాటర్‌బాటిళ్లను సీజ్ చేశారు. సిట్రిక్ యాసిడ్‌తో ప్యాక్ చేసిన వాటిని సీజ్ చేసిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. అలాగే, హెడ్‌క్వార్టర్స్ రెస్ట్ -ఓ-బార్‌ను తనిఖీ చేశారు. కాలం చెల్లిన పిజ్జాలు, బర్గర్స్, నూడుల్స్‌ను గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన శాఖాహారం, మాంసా ఆహార వస్తువులను, కాలం చెల్లిన, లేబుల్స్ లేని వాటిని గుర్తించారు. కేఎఫ్‌సీలో సైతం దాడులు నిర్వహించిన అధికారులు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్‌ను చూపించకపోవడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెస్టారెంట్స్, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయాలపై దాడులు కొనసాగిస్తామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. లైసెన్స్‌లు.. ఆహార పదార్థాల నాణ్యత లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్ని రకాల పంటలకూ బోనస్ ఇవ్వాలి

- సిపిఐ(ఎంఎల్) లిబరేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన అన్ని రకాల పంటలకూ బోనస్ ఇవ్వాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం సమంజసం కాదని తెలిపారు. మిగతా వడ్లకూ బోనస్‌ను వర్తింపచేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

ధిక్కార స్వరం.. రాకేష్ రెడ్డి

- పట్టభద్రులు సమాజానికి దిశ దశగా నిలిచి ఓటేయండి
- ఆరు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ మోసం
- పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వంలో రెండు లక్షల ఉద్యోగాలు
- ఐదు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇచ్చింది లేదు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

గ్రాడ్యుయేట్ల సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధిక్కార స్వరం ఏనుగుల రాకేష్ రెడ్డి కావాలా.. బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్న కావాలో చదువుకున్న విద్యావంతులు ఆలోచించి ఓటేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. బుధవారం వరంగల్ జిల్లా నర్సంపేటలోని పద్మశాలీ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రాడ్యుయేట్ల సమావేశంలో కెటిఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక్క ఉచిత బస్సు హామీ తప్పా మిగతా ఐదింటీని అమలు చేయకుండా మోసగించిందన్నారు. గ్యారంటీలను నమ్మి మోసపోతే గోసపడతామంటూ నాడు తాము చెప్పామని, అది ఇప్పుడు కళ్లారా చూస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 6న తాను మొదటి సంతకంతో రైతు భరోసా పేరిట రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి.. ఐదు నెలలు ముగుస్తున్నా చేయలేదని ఆరోపించారు. కౌలు రైతుకు, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని చెప్పారని, ఎంత మంది ఖాతాలో జమయ్యాయో చెప్పాలన్నారు. కేసీఆర్ రైతుబంధు రూ.12 వేలు ఇస్తామంటే తాము రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్‌ను నమ్మి రైతులు ఓటేశారన్నారు. నిరుద్యోగులకు రూ. నాలుగు వేలు, మహాలక్ష్మీ పథకంలో ఆడపిల్లలకు రూ.2,500 ఎంతమందికి వచ్చాయో చెప్పాలన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్న కాంగ్రెస్ నేతల మాటలు ప్రజలు గుడ్డిగా నమ్మారని, ఆరు నెలలు దగ్గరకు వస్తున్నా హామీలు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. నాడు కెసిఆర్ పాలనలో నాట్లు వేస్తున్నప్పుడు రైతుబంధు ఇస్తే, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓట్లు వేసే ముందు ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేడు మాట మార్చిందని, బోనస్ కాస్తా బోగస్ అయిందన్నారు. మొదటి యేడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పటివరకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలన్నారు. భారత దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని నోటిఫికేషన్‌లను ఇచ్చి రెండు లక్షల ఉద్యోగాలను నాటి కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని పైగా 30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. నాటి ప్రభుత్వంలో కొన్ని లీగల్ కారణంగా నిలిచిపోయిన ఉద్యోగాలకు కోర్టు అనుమతి ఇస్తే వాటిని తాను ఇచ్చినట్టుగా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నాడు తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్లనే ఓటమి పాలయ్యామన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయకపోతే కూలిపోయేది లేదనీ, కానీ అసెంబ్లీలో హామీల అమలు కోసం చదువుకున్న యువతకు ఉద్యోగాల నోటిఫికేషన్లకై ప్రశ్నించే గళం విప్పే వ్యక్తిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న చరిత్ర విప్పితే అన్నీ నేరాలేనని, 56 కేసులతో చెంచల్‌గూడ జైల్ జీవితం అనుభవించిన వ్యక్తికి సీటు ఇవ్వడం ఆ పార్టీకే చెల్లిందని చెప్పారు. ఉన్నత విద్యావంతుడు, ప్రభుత్వంపై ధిక్కారస్వరం విప్పే ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి మిడియాల రవీందర్ రావు, బిఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, ఒడిసిఎంఎస్ చైర్మెన్ గుగులోతు రామస్వామి, నాయకులు మునిగాల వెంకట్ రెడ్డి, గుంటి కిషన్, జడ్‌పిటిసి, ఎంపిపి, డిఆర్ఎస్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లుగా ఎదురుచూపులే!

- పూర్తి కాని గుండ్ల వాగు ప్రాజెక్టు
- రైతుల పరిస్థితి అగమ్య గోచరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలోని గుండ్ల వాగు కథ కంచికేనా అన్న చందంగా మారింది. సుమారు 20 ఏళ్లు కావస్తున్నా రైతుల కలైన గుండ్ల వాగు నిర్మాణం సాకారం కావట్లేదు. గత బిఆర్ఎస్ పదేళ్లలో పాలనలో ప్రాజెక్టు నిర్వాహణ పట్ల అంటిముట్టనట్టు వ్యవహరించింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర్ రెడ్డి సుమారు రూ.తొమ్మిది కోట్లతో గుండ్ల వాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు ఎడమ కాలువ కింద 1500 ఎకరాలు కుడి కాలువ కింద 3000 ఎకరాలు మొత్తం 4500 ఎకరాల ఆయకట్టు సాగు లక్ష్యంగా నిర్దేశించబడిన ప్రాజెక్టు ఇది. అప్పటినుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు రెవెన్యూ పరిధిలోకి రాకపోగా ఆయకట్టు రైతుల ఆశలు ఆడియాసలుగానే మిగిలిపోయాయి.

గుండ్లవాగు ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగానే 2006 ఆగస్టు మూడున తెగి సంచలనాత్మకంగా మారింది. మానవుల ప్రాణాలకు నష్టం వాటిల్లకపోయినా, బర్రెలు, గొర్రెలు, విద్యుత్ మోటార్లు, పైపులు కొట్టుకుపోగా భూములు కోతకు గురై ఇసుక మేటలు పెట్టాయి. రైతుల భూముల్లో రాళ్లగుట్టలు పేరుకుపోయాయి. తెగిన ఈ ప్రాజెక్టు అప్పుడున్న రూలింగ్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి ఎంతో చెడ్డ పేరు తెచ్చిపెట్టింది. ప్రతిపక్షాలు ప్రాజెక్టును సందర్శించి ప్రభుత్వాన్ని చివాట్లు పెట్టాయి. అప్పుడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అధికారులతో నష్ట నివారణా చర్యలు చేపట్టి మోటార్లు, పైపుల స్థానాల్లో కొత్తవాటిని అందించగా కొద్దోగొప్పో పరిహారాన్ని రైతులకు అందజేశారు. నష్ట నివారణా చర్యల్లో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008-09లో రూ.18 కోట్లతో సిసి కట్ట నిర్మాణాన్ని చేపట్టి ప్రాజెక్టును ఇంచుమించు పూర్తి చేసింది. నాడు తీసిన కాలువలు ఇప్పటివరకు అలాగే ఉండిపోయాయి. ఆ కాలువల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అక్కరకు రాకుండా పోయాయి. ప్రాజెక్టు రెవెన్యూ పరిధిలోకి రాకపోవడం వల్ల నాటి నుంచి నేటి వరకు ఆయకట్టు ప్రకటించకపోవడం వల్ల ఆయకట్టు చివరి భూములు బీడులు గానే ఉండిపోతున్నాయి. కేవలం ప్రాజెక్టు మొదట ఉన్న భూములకు మాత్రమే సాగునీరు అందుతోంది. చివరి భూములకు అందక ఇబ్బందులు పడుతున్నారు. రైతులే డబ్బులు పోగుచేసుకుని కాలువలను పూడిక తీసుకుని పారించుకుందామన్న ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోతోందని ఆయకట్టు చివరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుకు నిర్మించిన తూముల్లో రెండు తూములు పూర్తిగా శిథిలమై లీకేజీలతో నీరు వృథాగా పోతోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.30 కోట్ల పైచిలుకు వ్యయాన్ని ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించింది. అయినా ఫలితం శూన్యమని రైతులు వాపోతున్నారు. నీళ్లు అందుతాయి కదా అని నాట్లు వేసి పంటలు ఎండిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పంట కాలువలను పూర్తిస్థాయిలో తయారుచేసి సిసి నిర్మాణాలు చేపడితే రైతులకు ఉపయోగంగా ఉంటుందని, తూములను కూడా పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం చేస్తే నీటి లీకేజీని అరికట్టవచ్చని బాధిత రైతులు చెబుతున్నారు.

అమలు కానీ హామీలు..

మంత్రి చందూలాల్ పర్యటించిన సమయంలో ప్రాజెక్టును చూసి మినీ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని, గిరిజనుల ఉపాధి కోసం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అయినా నేటికీ అమలు కాకపోవడం శోచనీయం. ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా రూ.2.66 కోట్లు రైతులకు పంపిణీ కాకుండా కలెక్టర్ ఆధీనంలో ఉన్నట్టు స్థానిక రైతులు తెలుపుతున్నారు. డబ్బులనూ రైతులకు పంపిణీ చేయాలని, ప్రాజెక్టుతోపాటు కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతాంగానికీ పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టుకు చేరుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేదని, అందుకు అవసరమైన రహదారి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఐటిడిఎ ద్వారా రూ.50లక్షల బిటి నిర్మాణం ప్రారంభమైందని, దీన్ని సిసి నిర్మాణంగా మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రాజెక్టు పూర్తి కావాలి
: ఇక రాంబాబు, రైతు, కర్లపెల్లి గ్రామం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టును మళ్లీ ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి చేయాలి. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సీతక్క కూడా ప్రాజెక్టును పూర్తి చేస్తానని ఆయకట్టు రైతాంగానికి స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. కాలువలకు సిసి నిర్మాణాలు చేసి పూర్తిస్థాయిలో ఆయకట్టు సాగు అయ్యేలా రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చిన దరిమిలా ఎదురుచూస్తున్నాం.

ఏడాదిలో వంద శాఖలు తెరుస్తాం

- అయోధ్యలో 840వ శాఖ ఏర్పాటు
- కెవిబి సిఇఒ రమేష్ బాబు వెల్లడి

అయోధ్య : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కొత్తగా 100 శాఖలను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కరూర్ వైశ్యా బ్యాంక్ (కెవిబి) ఎండి, సిఇఒ ఆర్ రమేష్ బాబు తెలిపారు. బుధవారం అయోధ్యలో బ్యాంక్ 840వ శాఖను ఛైర్‌పర్సన్ మీనా హేమచంద్రతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కొత్తగా 39 శాఖలను ప్రారంభించామన్నారు. 2024 మార్చి 31తో ముగిసిన ఏడాదిలో కెవిబి రూ.1,605 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర నిరర్థక ఆస్తులు 0.40 శాతానికి తగ్గాయి. ఆస్తులు, లాభదాయకత అంశంలో బ్యాంక్ మెరుగైన ఫలితాలను సాధిస్తుందని రమేష్ బాబు అన్నారు. నూతన శాఖ ప్రారంభోత్సవంలో కెవిబి సీనియర్ అధికారులు కెఎస్ రవీచంద్రన్, ఆర్ రాంకుమార్, కెజి మోహన్, మురళి రామస్వామి, ఆర్ విద్యా శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడింతలైన పేటియం నష్టాలు

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక సంస్థ పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ నష్టాలు భారీగా పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం(క్యూ4)లో రూ.550 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.169 కోట్ల నష్టాలతో పోల్చితే 3.2 రెట్ల నష్టాలు పెరిగాయి. గడిచిన క్యూ4లో సంస్థ రెవెన్యూ 3 శాతం తగ్గి రూ.2,267 కోట్లకు పరిమితమయ్యింది. నిబంధనలు ఉల్లంఘించిన పేటియం పేమెంట్ బ్యాంక్‌పై జనవరి 31న ఆర్‌బిఐ చర్యలు తీసుకోవడంతో ఆ సంస్థ ఆదాయం భారీగా తగ్గడంతో పాటుగా నష్టాలు పెరిగాయి. 2024 మార్చి ముగింపు నాటికి రూ.8,650 కోట్ల నగదు బ్యాలెన్స్ ఉందని తెలిపింది.

ఉద్యోగులపై వేటు..!

పేటియం ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడానికి త్వరలో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని సమాచారం. ఈ విషయమై ఆ సంస్థ సిఇఒ విజయ్ శేఖర్ శర్మ వాటాదారులకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. ఈ నిర్ణయంతో సంస్థకు ఏటా రూ.400-500 కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా వేశారని సమాచారం.

SALASAR
Building a stronger future

ఇఎంసి స్వాధీనానికి సకాలంలో చెల్లింపులు

- సలాసర్ టెక్నో వెల్లడి

హైదరాబాద్ : ఇఎంసి లిమిటెడ్ స్వాధీనానికి సకాలంలో పూర్తి చెల్లింపులు చేసినట్లు సలాసార్ టెక్నో ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. తమ వ్యూహాత్మక విస్తరణ ప్రయాణంలో ఒక స్మారక మైలురాయిగా ఇది నిలుస్తుందని పేర్కొంది. తమ సామర్థ్యం మా ప్రణాళికలను ఖచ్చితత్వంతో, చురుకుదనంతో అమలు చేయడంలో మా నిబద్ధతను నొక్కి చెబుతుందని తెలిపింది. ఇటీవల ఆ సంస్థ దివాలకు వచ్చిన ఇఎంసి లిమిటెడ్‌ను ఎన్‌సిఎల్‌టి ద్వారా దక్కించుకుంది. దీని మొత్తం స్వాధీన విలువ రూ.178 కోట్లుగా ఉంది. ఇఎంసి స్వాధీనంతో ఇంజనీరింగ్, మౌలిక వసతుల రంగంలో సలాసర్ టెక్నో మరింత బలోపేతం కానుందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

యూకో బ్యాంక్ ఎంజి రోడ్ శాఖ మార్పు

హైదరాబాద్ : సికింద్రాబాద్ ఎంజి రోడ్‌లోని యూకో బ్యాంక్ శాఖను అదే రోడ్‌లోని బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోకి మార్చారు. ఈ కొత్త శాఖను బుధవారం యూకో బ్యాంక్ జోనల్ హెడ్ ఎన్ శ్రీకాంత్ లాంచనంగా ప్రారంభించారు. తమ కొత్త శాఖ ఖాతాదారులకు మరింత చేరువగా.. అందరికీ కనిపించేలా ఉంటుందని ఆ బ్యాంక్ తెలిపింది. ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు సాధారణ ప్రజలకు తక్కువ వడ్డీ రేటుకే రుణాలు ఇస్తుందని ఎన్ శ్రీకాంత్ తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందే 1945లోనే ఎంజి రోడ్‌లో యూకో బ్యాంక్ తన శాఖను ఏర్పాటు చేయడం విశేషం.

పిల్లలుగా వచ్చి పిడుగులై మెరిశారు

- తెలంగాణ బాలోత్సవం ముగింపులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్‌కు హాలిడేస్‌లో వచ్చిన పిల్లలు.. ఎంతో విజ్ఞానం, నైపుణ్యం సాధించి పిడుగుల్లా మెరిశారని వక్తలు అన్నారు. లేడీ పిల్లలుగా ఎగిరి గంతులేశారని, విజ్ఞానం వినోదంతో పాటు సరదాగా గడిపారని తెలిపారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన 18 రోజులుగా నిర్వహించిన తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా భూపతి వెంకటేష్ మాట్లాడుతూ.. పిల్లలు 18 రోజులుగా మొబైల్ ఫోన్స్, ట్యాబ్, టివిలు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా సమ్మర్ క్యాంపులో ఆకాశమంత విశాలమైన ప్రపంచంలో విహరించారని తెలిపారు. పాఠ్యాంశాలు కాదు ప్రపంచాన్ని పరిచయం చేశామన్నారు. పిల్లలకు అవకాశాలు ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని నిరూపించింది బాలోత్సవం అన్నారు. చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. ఈనాడు పిల్లలు పాఠశాలల్లోని ఏడంతస్తుల మేడల్లో.. లేదా ఇరుకు గదుల్లో చదువుతున్నారని అన్నారు. అందువల్ల ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా వ్యవసాయ క్షేత్రం అయిన రాజేంద్రనగర్‌కు పిల్లలను బస్సుల్లో తీసుకెళ్లి వ్యవసాయం, పండ్ల తోటలను చూపించి, వాటి గురించి వివరించామన్నారు. వ్యవసాయ పరిశోధనా అధికారులతో మాట్లాడించి పిల్లలకు పంటలు పండే విధానాన్ని చూపించినట్టు తెలిపారు. 80 శాతం పిల్లలు వరి చేళ్లు చూడలేదని చెప్పడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఆడ పిల్లలకు ఈ క్యాంపు పులి పిల్లలుగా ఆత్మ గౌరవ భరోసానిచ్చిందన్నారు. కన్నీళ్లు కాదు ఆడపిల్లలు కన్నెర్ర చేయాలని, ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన నిలయం పిల్లల ఆనంద ఆలయంగా మారిందని, పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విజ్ఞాన కేంద్రంలో పిల్లల లైబ్రరీ నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవం కార్యదర్శి ఎన్ సోమయ్య మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మగౌరవం పెంపొందించి.. విజ్ఞానంతో సగర్వంగా సాగనంపుతున్నామని, 18 రకాల కార్యక్రమాలు ఈ సమ్మర్ క్యాంపులో నేర్పించారని తెలిపారు. మూఢనమ్మకాలు, మాయలు, మంత్రాలకు దూరంగా ఉండాలని బోధించామని చెప్పారు. ఇంగ్లీష్ మాత్రమే కాదు మాతృభాష అవసరాన్ని కూడా ఈ సమ్మర్ క్యాంపు గుర్తు చేసిందన్నారు. అనంతరం పిల్లలందరికీ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె సుజావతి, మమత, పద్మ, కోశాధికారి జి బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు నవీన్, గోపాల్, భవాని, మానస తదితరులు పాల్గొన్నారు.